




www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

MONDAY 16TH FEBUARY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 315 COST : 3\- KHAMMAM, TELANGANA

సోమవారం 16 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 315 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## 2.7 కిలోల బంగారాన్ని కాజేసిన మేనేజర్



బెంగళూరు, ఫిబ్రవరి15: కంచె చేను మేసినట్టు.. వినియోగదారులు లాకర్లలో దాచుకున్న బంగారాన్ని బ్యాంక్ మేనేజర్ కాజేశాడు. దాదాపు 2.7 కిలోల బంగారు ఆభరణాలను దొంగిలించగా, వాటి ద్వారా పొందిన సొమ్ముతో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం ఆడాడు. బ్యాంక్ కస్టమర్లు తమ బంగారాన్ని విడిపించుకునేందుకు రాగా, ఫిబ్రవరి 2న బంగారు ఆభరణాల దొంగతనం బయటపడింది.

➢ 2వ పేజిలో..

# మేం సేవకులం..

# పాలకులం కాదని ఏనాడో చెప్పాను..

- 'నేనే రాజు.. నేనే మంత్రి'ని మరోలా అర్థం చేసుకున్నారు
- ముఖ్యమంత్రినీ నేనే.. మునిసిపల్ మంత్రినీ నేనే..ఎన్నికల్లో గెలుపోటములకు బాధ్యత నాదేనని అర్థం
- మునిసిపల్ ఎన్నికల ఫలితాలు 90 శాతం మాకే అనుకూలం
- పేదలను పరిపాలనలో భాగస్వాములను చేశాం
- దళితుడిని అధ్యక్షా అని మైక్ అడిగేలా పైన కూర్చోబెట్టాం
- ప్రభుత్వంలో 30 శాతం పదవులు ఎస్సీలకు ఇచ్చాం
- నల్లమలలో 20 ఎకరాల్లో సేవాలాల్ పుణ్యక్షేత్రం
- వచ్చే ఏడాది జయంతి వేడుకలు అక్కడే నిర్వహిస్తాం
- ప్రతి తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంపుసెట్లు మంజూరు
- సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (అక్షరం న్యూస్)

'నేనే రాజు.. నేనే మంత్రి' అని తాను చెప్పిన విషయాన్ని కొందరు వేరే విధంగా అర్థం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము పాలకులం కాదని, సేవకులమని, ఈ విషయాన్ని తాను ఏనాడో చెప్పానని తెలిపారు. తాను పాలకుడిగా ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవ చేయడానికే ప్రజలు తనకు అవకాశం ఇచ్చారని స్పష్టం చేశారు.

ఆదివారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో జరిగిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. "ముఖ్యమంత్రి నేనే.. మునిసిపల్ మంత్రిని నేనే. అందుకే ఎన్నికల్లో గెలుపోటములకు నాదే బాధ్యత అని చెప్పాను. మునిసిపల్ ఎన్నికల్లో 90శాతం ఫలితాలు మాకు అనుకూలంగా వచ్చాయి. ఇవి మా పనితీరుకు గీటురాయి. ఈ విషయం కొందరికి అర్థం కాదు. అర్థమైనా స్వీకరించే గొప్ప మనసు వాళ్లకు లేదు. అందుకే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. పేదలు పాలించకూడదు.. కేవలం మా పిల్లలే రాజ్యాలు ఏలాలి అన్నది కొందరి విధానం. కానీ, నేను పరిపాలనలో పేదలను భాగస్వాములను చేశాను" అని సీఎం రేవంత్ అన్నారు. తనకు

➢ మిగతా 2వ పేజిలో..




## పాలకవర్గాలు కొలువుదీరేది నేడే

- కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం
- మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

హైదరాబాద్, ఫిబ్రవరి 15 రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరిగిన మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాలు సోమవారం కొలువుదీరనున్నాయి. ఎన్నికల్లో కీలక ఘట్టమైన మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికనూ చేపట్టనున్నారు. ముందుగా.. రాష్ట్రంలోని 116 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు సంబంధించి నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు. కొత్తగా ఎన్నికైన సభ్యులతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లను కలుపుకొని ఈ ఎన్నిక ప్రక్రియ చేపడతారు. ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఏవైనా సమస్యలు ఎదురైనా, అనివార్య కారణాల వల్ల ఎన్నిక పూర్తికాకపోయినా.. మరుసటి రోజు (ఈనెల 17న) ఈ ప్రక్రియను పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన ఏర్పాట్లు చేశారు. కాగా, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించిన వార్డులు/డివిజన్ల సంఖ్యకు అనుగుణంగా.. చైర్మన్, వైస్‌చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నికకు సరైన కోరం ఉన్నచోట్ల ప్రక్రియ

➢ మిగతా 2వ పేజిలో..

# ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ఉండాల్సిందే!

- ఆరోగ్యం ప్రాథమిక హక్కు.. రాజీపడే ప్రసక్తే లేదు
- ఎఫ్‌ఎస్‌ఎస్ ఏఐకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 (అక్షరం న్యూస్)

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడొద్దని సుప్రీంకోర్టు ఎఫ్ఎస్ఎస్ ఏఐను హెచ్చరించింది. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. ప్రజారోగ్యం విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని తేల్చిచెప్పింది. ఇకపై ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ముద్ర తప్పనిసరిగా ఉండాల్సిందేని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎ?సఎ?సఏఐ)ను ఆదేశించింది. ప్యాకెట్లలోని ఆహారంలో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వుకు



సంబంధించి వినియోగదారుడికి అర్థమయ్యేలా ప్యాకెట్ ముందు భాగంలోనే స్పష్టమైన హెచ్చరికల లేబుళ్లు తప్పనిసరి చేయాలని పేర్కొంది. ప్యాకేజ్డ్ ఫుడ్‌కు సంబంధించి '3ఎస్ అండ్ అవర్ హెల్త్ సొసైటీ' దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈమేరకు ఆదేశాలు ఇచ్చింది. ప్యాక్ చేసిన ఆహార పదార్థాల్లో చక్కెర, ఉప్పు,

➢ మిగతా 2వ పేజిలో..

# స్పీకర్ తొలగింపుపై 9న చర్చ

- అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో అదే రోజు ఓటింగ్..
- పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు వెల్లడి



తవాంగ్, ఫిబ్రవరి15: (అక్షరం న్యూస్)

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై మలివిడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే మార్చి 9న చర్చ జరుగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వెల్లడించారు. అదే రోజు సభలో ఓటింగ్ కూడా జరుగుతుందన్నారు. ఆదివారం ఆయన అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌లో ఓ వార్తాసంస్థతో మాట్లాడారు. రెండో విడత సమావేశాలు మొదలయ్యే తొలి రోజునే అవిశ్వాస తీర్మానంపై చర్చ

➢ మిగతా 2వ పేజిలో..

## కేటీఆర్‌పై వారంలో చార్జిషీట్!

- ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఏసీబీ దాఖలు
- కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంటూ అభియోగపత్రం
- అన్ని పత్రాలను సిద్ధం చేసుకుంటున్న అధికారులు



హైదరాబాద్, ఫిబ్రవరి 15 ఫార్ములా ఈ-కారు రేసు కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఈ వారమే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి

➢ మిగతా 2వ పేజిలో..

## సూపర్8.. పాక్‌పై భారత్ ఎనిమిదో విజయం



- ప్రపంచకప్‌లో అప్రతిహత రికార్డు ఇషాన్ కిషన్ విజృంభణ
- బౌలర్ల సమష్టి ప్రదర్శన టీమ్‌ఇండియాకు సూపర్-8 బెర్తు

టీ20 ప్రపంచకప్‌లో భారత్ దుమ్మురేపింది! ప్రియమైన ప్రత్యర్థి పాకిస్థాన్‌పై బెబ్బులిలా విరుచుకుపడింది. సండే బ్లాక్‌బస్టర్‌లో టీమ్‌ఇండియా పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెగాటోర్నీలో తమ అజేయ రికార్డును అప్రతిహతంగా కొనసాగిస్తూ ఏకంగా ఎనిమిదోసారి విజయఢంకా మోగించి..మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-8 బెర్తు ఖరారు చేసుకుంది. కొలంబో గడ్డ మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ప్యాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగిన వేళ పోరాడే స్కోరు అందుకున్న టీమ్‌ఇండియా

➢ మిగతా 2వ పేజిలో..



## శక్తితోనే సాధించాం!

- వాణిజ్య ఒప్పందాల్లో బలమైన స్థితిలో ఉండి చర్చలు
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

➢ 2వ పేజిలో..

# పాలకవర్గాలు కొలువుదీరేది నేడే

➢ మొదటి పేజీ తరువాయి

సాఫీగా సాగే అవకాశం ఉంది. కోరం తక్కువగా ఉండటం, తమ పార్టీ సభ్యులు పక్క పార్టీకి వెళ్తారన్న సందేహం ఉన్న చోట్ల కొత్తగా ఎన్నికైన సభ్యులను ఆయా పార్టీలు క్యాంపులకు తరలించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ తమ సభ్యులతోపాటు మద్దతుదారులనూ గోవా, బెంగుళూరు తదితర ప్రాంతాలకు తరలించింది. బీజేపీ, బీఆర్ఎస్ సైతం తమ పార్టీల తరఫున ఎన్నికైన వారితోపాటు తమకు మద్దతునిస్తామన్న సభ్యులను స్థానికంగా, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు తరలించి క్యాంపుల్లోనే ఉంచాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేసేందుకు వారిని క్యాంపుల నుంచి నేరుగా మునిసిపల్ కార్యాలయాలకు తీసుకురానున్నారు. తద్వారా వారు చేజారిపోకుండా.. తాము నిర్ణయించిన చైర్మన్, మేయర్‌లను ఎన్నుకునేలా ప్రధాన పార్టీలు తగిన ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈ పరోక్ష ఎన్నికలో చేతులెత్తే విధానం ద్వారా విజేతలను నిర్ణయిస్తారు.

## సూపర్8..పాక్‌పై భారత్ ఎనిమిదో విజయం

➢ మొదటి పేజీ తరువాయి

సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. పాక్ బౌలర్లను ఉతికిఆరేస్తూ కిషన్ బౌండరీలతో శివతాండవం చేశాడు. బుమ్రా, హార్దిక్ పాక్‌ను ఆదిలోనే దెబ్బతీయగా, అక్షర్, వరుణ్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. వీరి ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాక్ 61 పరుగుల తేడాతో మట్టికరించింది. హ్యాట్రిక్ విజయాలతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టాప్ గేర్‌లో దూసుకెళుతుండగా, పాక్ సూపర్-8 ఆశలు మిణుకుమిణుకుమంటున్నాయి.

కొలంబో: ఫార్మాట్ ఏదైనా ప్రపంచకప్ టోర్నీల్లో దాయాది పాకిస్థాన్‌కు చుక్కలు చూపెట్టే టీమ్‌ఇండియా.. ఆ సంప్రదాయాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తూ మరోసారి విజయ దుందుభి మోగించింది. ఇరుజట్ల మధ్య కొలంబో ఆతిథ్యమిచ్చిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో భారత్.. 61 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించి సూపర్-8 బెర్తును ఖరారు చేసుకుంది. అదీగాక ఐసీసీ టీ20 టోర్నీల్లో పాక్‌పై భారత ఆధిపత్యాన్ని 8-1కు పెంచుకుంది. మ్యాచ్‌లో పాక్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా..

ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77, 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌కు తోడు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29 బంతుల్లో 32, 3 ఫోర్లు) నిలకడైన ఆటతో 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 175 రన్స్ చేసింది. ఛేదనలో భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో పాక్ 18 ఓవర్లకు 114 రన్స్‌కు తోకముడిచింది. ఉస్మాన్ ఖాన్ (34 బంతుల్లో 44, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా షాహిన్ అఫ్రిది (19 బంతుల్లో 23 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆడకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. హార్దిక్ (2/16), బుమ్రా (2/17), వరుణ్ (2/17), అక్షర్ (2/29) తలా రెండు వికెట్లు పడగొట్టి పాక్ పనిపట్టారు. ఇషాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

### పవర్ ప్లేలోనే ఖేల్ ఖతం..

ఇషాన్ మినహా మిగిలిన భారత బ్యాటర్లు ఆచితూచి ఆడిన పిచ్‌పై పాక్ బ్యాటర్లు ఎలా స్పందిస్తారు? అన్న ఉత్కంఠకు తొలి మూడు ఓవర్లలోనే తెరపడింది. పవర్ ప్లేలోనే పాక్ ఓటమి దాదాపుగా ఖాయమైంది. హార్దిక్, బుమ్రా, అక్షర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టు తొలి 6 ఓవర్లలో టాపార్డర్‌ను కోల్పోయి ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేక పోయింది. హార్దిక్ తొలి ఓవర్లోనే ప్రమాదకర సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను డకౌట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. రెండో ఓవర్‌లో బంతినందుకున్న బుమ్రా.. ఐదు బంతుల వ్యవధిలో రెండు కీలక వికెట్లు పడగొట్టి దాయాదిని చావుదెబ్బ కొట్టాడు.రెండో బంతికి అయూబ్ (6)ను అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో వికెట్ల ముందు బలిగొన్న అతడు.. ఆఖరి బంతికి కెప్టెన్ సల్మాన్ (4)ను బోల్తా కొట్టించాడు. ఐదో ఓవర్‌లో అక్షర్.. బాబర్ ఆజమ్ (5)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో ఆ జట్టు పవర్ ప్లేలో 38/4తో నిలిచింది. ఈ క్రమంలో పాక్‌ను కీపర్ ఉస్మాన్ ఆదుకునే యత్నం చేశాడు. దూకుడుగా ఆడుతూ భారత స్పిన్నర్లను ఎదుర్కొన్న అతడు.. షాదాబ్ ఖాన్ (14)తో కలిసి ఐదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. కానీ అక్షర్ 11వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. అంతే..! ఆ తర్వాత పాక్ లోయరార్డర్ తోకముడవడానికి పెద్దగా టైమ్ పట్టలేదు.

### ఇషాన్‌దార్ ఇన్నింగ్స్

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. పాక్ పనిపడతాడనుకున్న అభిషేక్ శర్మ వికెట్‌ను ఫస్ట్ ఓవర్లోనే కోల్పోయింది. పాక్ సారథి వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతిని పుల్ చేయబోయి మిడాన్‌లో అఫ్రిదికి చిక్కాడు. అభిషేక్ గండాన్ని తప్పించుకున్నామని సంబురపడ్డ పాక్ ఆశలపై ఇషాన్ నీళ్లు చల్లాడు. షాహిన్ బౌలింగ్‌లో సిక్స్‌తో వేట ఆరంభించిన అతడు.. అబ్రర్ ఐదో ఓవర్లో 6, 4 బాదాడు. అతడే వేసిన ఏడో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో అతడి అర్ధశతకం కూడా పూర్తయింది.

దూకుడుగా ఆడే క్రమంలో ఇషాన్‌ను 9వ ఓవర్లో అయూబ్ బౌల్డ్ చేయడంతో 87 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇషాన్ నిష్క్రమణ తర్వాత భారత స్కోరు వేగం తగ్గింది. పాక్ సారథి వరుసగా స్పిన్నర్లతో వేయించి టీమ్‌ఇండియా భారీ స్కోరుకు అడ్డుకట్ట వేయగలిగాడు. తిలక్, సూర్య క్రీజులో ఉన్నా సింగిల్స్, డబుల్స్‌కే పరిమితమయ్యారు. అయూబ్ ఒకే ఓవర్లో తిలక్, హార్దిక్‌ను ఔట్ చేసి షాకిచ్చినా ఆఖర్లో శివమ్ దూబె (17 బంతుల్లో 27, 3 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (11) మెరుపులతో భారత్ 170 పరుగుల మార్కును దాటేసింది.

### నీలి సముద్రంలా!

భారత్, పాక్ ప్రపంచకప్ మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తారు. అసలు పోరు జరుగుతుందా లేదా అన్న అనుమానాలు పటాపంచలు చేస్తూ ఐసీసీ ప్రయత్నాలు సఫలం కాగా, ఫ్యాన్స్ సండే బ్లాక్‌బాస్టర్‌ను ఆస్వాదించారు. మ్యాచ్‌కు వేదికైన ప్రేమదాస స్టేడియానికి ఇరు దేశాల క్రికెట్ అభిమానులు వేల సంఖ్యలో తరలివచ్చారు. స్టేడియంలో ఎటు చూసినా టీమ్‌ఇండియా జెర్సీలు ధరించిన అభిమానులు వేల సంఖ్యలో ఉండటంతో నీలి సముద్రాన్ని తలపించింది. మెగాటోర్నీకి బ్రాండ్ అంబాసీడర్‌గా వ్యవహరిస్తున్న రోహిత్‌శర్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కప్‌ను స్టేడియంలో తీసుకొచ్చిన హిట్‌మ్యాన్ ఫ్యాన్స్‌తో సందడి చేశాడు. తన భార్య రితికా సజ్దేతో కలిసి వచ్చిన రోహిత్...ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లాతో కలిసి మ్యాచ్ వీక్షించాడు.

### నో షేక్‌హ్యాండ్

భారత్, పాకిస్థాన్ మెగా పోరులో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. గతంలో లాగే ఇరు జట్ల కెప్టెన్లు సూర్యకుమార్ యాదవ్, సల్మాన్‌అలీ ఆగా పాత సంప్రదాయాన్నే కొనసాగించారు. మ్యాచ్‌కు ముందు టాస్ వేసే సమయంలో కనీసం ఒకరిని ఒకరు చూసుకోని కెప్టెన్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోకుండానే వెనుదిరిగారు. ఇటీవల జరిగిన ఆసియాకప్‌లోనూ రెండు దేశాల సారథులు ఇదే ఒరవడి కొనసాగించారు. టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ప్లేయర్లు కరచాలనం లేకుండానే డగౌట్‌కు చేరుకున్నారు.

18 టీ20 ప్రపంచకప్‌లో 18 ఓవర్లు స్పిన్ బౌలింగ్ చేయడం ఇదే తొలిసారి పాక్ స్పిన్నర్లు భారత్‌పై ఈ ఫీట్ నమోదు చేశారు.

టీ20 వరల్డ్ కప్‌లో ఆరుగురు స్పిన్నర్లు ఒక మ్యాచ్‌లో బౌలింగ్ చేయడం ఇదే తొలిసారి. 16 ఐసీసీ పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో 16 మ్యాచ్‌లాడిన భారత్ అన్నింటా వరుస విజయాలు సాధించింది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాపై ఓటమి టీమ్‌ఇండియాకు చివరిది.

# మేం సేవకులం.. పాలకులం కాదని ఏనాడో చెప్పాను..

➢ మొదటి పేజీ తరువాయి

అవకాశమిచ్చిన వర్గాలకు సేవ చేయాలన్నదే తన ప్రయత్నమన్నారు. 40 ఏళ్లుగా జటిలంగా మారిన ఎస్సీ వర్గీకరణ సమస్యను తాను పరిష్కరించానని తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే విర్రవీగడం, ఓడిపోతే కుంగిపోవడం తనకు తెలియదన్నారు. 20 ఏళ్లుగా ప్రజల మధ్యే ఉన్నానని, వచ్చే 20 ఏళ్లు కూడా పేదల కోసమే పనిచేస్తానని ప్రకటించారు.

### ఎస్సీలకు 30 శాతం పదవులు..

గతంలో ఒక నాయకుడు దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి మోసం చేశారని సీఎం రేవంత్ అన్నారు. కానీ, తాను దళితుడిని 'అధ్యక్షా' అని పిలిచి మైక్ అడిగేలా స్పీకర్ హోదాలో పైన కూర్చోబెట్టానని గుర్తు చేశారు. 15శాతం ఉన్న ఎస్సీలకు ప్రభుత్వంలో 30 శాతం పదవులు ఇచ్చామని, నలుగురు మంత్రులు, స్పీకర్ పదవి ఇచ్చి సామాజిక మార్పును తీసుకొచ్చామని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యం గొప్పతనమని, అంబేద్కర్ ఇచ్చిన ఆయుధమని పేర్కొన్నారు. మిడ్జిల్‌లో తాను జడ్పీటీసీగా పోటీ చేసినప్పుడు తండాల్లోని యువకులు తన విజయంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానంలో లంబాడీ సోదరులు అండగా నిలిచార ని, నేడు సీఎం హోదాలో ఉండడం వెనుక వారి అండదండలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర ఎనలేనిదని, సుర్జ?షనాయక్, కవితా నాయక్ ఆత్మబలిదానాలు చేశారని అన్నారు. లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చిరస్మరణీయ క్షేత్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలోని నల్లమల అడవుల్లో ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం అచ్చంపేట అటవీ ప్రాంతంలో 20 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించినట్లు తెలిపారు. ఏడాదిలోపు దేవాలయ నిర్మాణాన్ని పూర్తిచేసి వచ్చేసారి జయంతి వేడుకలను అక్కడే నిర్వహిస్తామన్నారు. సంత్ సేవాలాల్ లంబాడీ సమాజాన్ని సన్మార్గంలో నడిపించి అభ్యున్నతి దిశగా తీసుకెళ్లిన మహనీయుడని, ఆయన బోధనలు నైతిక విలువలు, సేవాభావం, సామాజిక ఐక్యతను బలపరిచాయని అన్నారు. గిరిజనులు, తండాల అభివృద్ధి కోసం సీఎం పలు వరాలు ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంపుసెట్లు, పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, తాగునీరు, విద్యుత్తు వంటి మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు అందనిచోట ట్యాంకులు నిర్మించి సోలార్ పంపుసెట్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. గిరిజన విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. చదువే అన్ని హోదాలను తెస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. 100 నియోజకవర్గాల్లో రూ.20 వేల కోట్లతో ఒక్కో చోట 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. గిరిజన విద్యార్థులకు స్ఫూర్తి కలగాలనే ఆ వర్గానికి చెందిన అధికారులకు కీలక పోస్టింగ్‌లు ఇచ్చానని, గ్రూప్-1 ఫలితాల్లో 87్న ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, సముజ్వల పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై వారంలో చార్జిషీట్!

➢ మొదటి పేజీ తరువాయి

కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంటూ నేరాభియోగ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. కేసు విచారణ దాదాపు పూర్తయిందని, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయడమే తరువాయి అని ఉన్నతాధికారులు తెలిపారు. చార్జిషీట్‌కు ఇప్పటికే తుదిరూపం ఇచ్చిన ఏసీబీ అధికారులు.. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు డీవోపీటీ అనుమతి కోసం ఆగారు. తాజాగా డీవోపీటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి రావడంతో ఆ విషయాన్ని ప్రభుత్వం ఏసీబీకి తెలియజేసింది. దీంతో ఏసీబీ అధికారులు ఈ వారంలో చార్జిషీట్ దాఖలుకు కావాల్సిన అన్ని పత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు కీలకమైన పలు ఎలక్ట్రానిక్, డిజిటల్ సాక్ష్యాధారాలను సేకరించారు. ఫార్ములా ఈ-కారు రేసు వల్ల హెచ్ఎండీఏకు రూ.75.88 కోట్ల నష్టం జరిగిందన్న విషయాన్ని రుజువు చేయడానికి కావాల్సిన అన్ని ఆధారాలను సేకరించారు. ఫార్ములా ఈ-ఆపరేషన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్న ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీకి కారు రేసు బాధ్యతలు అప్పగించడం, దానికి ప్రతిఫలంగా ఆ సంస్థ నుంచి బీఆర్ఎస్ పార్టీకి రూ.45 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు రావడం క్విడ్ ప్రోకోలో భాగమేనన్న విషయాన్ని చార్జిషీట్‌లో ఏసీబీ అధికారులు పొందుపరచనున్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గతేడాది నవంబరులో అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఫార్ములా ఈ-కారు రేసుకు సంబంధించి 2024 డిసెంబరు 18న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీని ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో కేసు నమోదు చేసింది. ఈ మేరకు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కేటీఆర్‌లను ఈడీ, ఏసీబీ అధికారులు విచారించారు. చార్జిషీట్‌లో కేటీఆర్ తదితరులు నిధుల దుర్వినియోగానికి, మోసానికి పాల్పడ్డారని, నేరపూరిత కుట్రలో భాగస్వామి అయ్యారని, ఇతరులకు లాభం కలిగించే విధంగా ప్రవర్తించారని ఏసీబీ అధికారులు పేర్కొనబోతున్నట్లు సమాచారం.

# రైతులకు మోదీ వంచన

- వాణిజ్య ఒప్పందంతో దేశాన్ని అమ్మేశారు: రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆయన మన రైతులను వంచించారని, దేశాన్ని అమ్మేశారని ఆరోపించారు. ఇది అన్నదాతల భవిష్యత్‌కు సంబంధించిన అంశమన్నారు. భారత వ్యవసాయ పరిశ్రమపై పరాయిదేశం పెత్తనం దీర్ఘకాలం కొనసాగేందుకు అనుమతిస్తున్నారా అని ఆదివారం 'ఎక్స్'లో నిలదీశారు. ప్రధానిపై ఈ సందర్భంగా ఐదు ప్రశ్నలు సంధించారు. ఇది ఇవాల్టి వ్యవహారం కాదని.. భవిష్యత్‌కు కూడా సంబంధించిందని స్పష్టంచేశారు. పత్తి రైతులు, ఎగుమతిదారుల ప్రయోజనాల పరిరక్షణలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆయన శనివారం కూడా ధ్వజమెత్తారు. బంగ్లాదేశ్‌తో వాణిజ్య ఒప్పందంతో అమెరికా ఆ దేశ జౌళి ఉత్పత్తులపై సుంకం మినహాయించిందని.. దీనివల్ల భారత జౌళి పరిశ్రమ సర్వనాశనమవుతుందని విమర్శించారు. ఇదిలా ఉండగా, యూపీఏ హయాంలో మంత్రి కపిల్ సిబల్.. 2010లో ఎప్‌స్టిన్ నిధులతో నడుస్తున్న సంస్థ నుంచి అవార్డు తీసుకున్నారని బీజేపీ తెలిపింది. దీనిపై రాహుల్‌గాంధీ పార్లమెంటులో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

రాహుల్ అడిగిన 5 ప్రశ్నలు

అమెరికా జన్యుమార్పిడి (జీఎం) పంట అయిన మొక్కజొన్న పొడిని దిగుమతి చేసుకోవడంలో అర్థమేమిటి? భారతీయ పశుసంపదతో ఈ జన్యు పొడిని తినిపిస్తారా? దీనివల్ల మన పాల ఉత్పత్తులు ఇక అమెరికాపై ఆధారపడాల్సిందేనా?

జీఎం సోయా నూనెను దిగుమతి చేసుకుంటే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా సోయా రైతులపై ప్రతికూల ప్రభావం పడదా?

అదనపు ఉత్పత్తుల దిగుమతి అంటే అందులో ఏమున్నాయి? పప్పులు.. ఇతర పంటలను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలన్న ఒత్తిడికి ఇది సూచిక కాదా?

వాణిజ్యేతర అడ్డంకులు తొలగించాలంటే అర్థమేంటి? జన్యుమార్పిడి పంటలపై తన దృఢవైఖరిని భారత్ సడలించుకోవాలని.. పంటల సేకరణ, మద్దతు ధరలు, బోనస్‌లను కుదించాలని అమెరికా భవిష్యత్‌లో ఒత్తిడి తెస్తుందా?ఒక్కసారి అమెరికా వ్యవసాయ దిగుమతులకు మన మార్కెట్ ద్వారాలు తెరిచామంటే ఏటికేడాదీ మరింత విస్తృతం చేయాల్సి ఉంటుంది. దీనిని అడ్డుకుంటారా.. లేక క్రమంగా మరిన్ని పంటలను దిగుమతి చేసుకుందామంటారా?

# శక్తితోనే సాధించాం!

- వాణిజ్య ఒప్పందాల్లో బలమైన స్థితిలో ఉండి చర్చలు
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఆదివారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

### బలమైన స్థానంలో ఉండి బేరమాడాం

అమెరికాతో ట్రేడ్ డీల్ విషయంలో ప్రతిపక్షాల విమర్శలను ప్రధాని తిప్పికొట్టారు. ట్రేడ్ డీల్స్ చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాసాలు నిర్వహించామని తెలిపారు. 'ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించటంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. దానివల్లే మేం బలమైన స్థితిలో ఉండి వాణిజ్య ఒప్పంద చర్చల్లో బేరసారాలు నిర్వహించగలిగాం. వస్త్రాలు, తోలు, కెమికల్స్, చేతివృత్తులు, రత్నాలు తదితర రంగాల్లో ఎంఎ?సఎంఈ పరిశ్రమలు మరింత విస్తరించేలా ఎఫ్‌టీఏలను డిజైన్ చేశాం' అని ప్రధాని మోదీ విమర్శిచారు.

### ప్రైవేటు రంగానిదే కీలకపాత్ర

దేశ అభివృద్ధిలో ఇకపై ప్రైవేటు రంగమే కీలకపాత్ర పోషించనుందని ప్రధాని తెలిపారు. ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం, అంతర్జాతీయ పోటీని తట్టుకొనే విషయాల్లో ప్రైవేటు రంగ సంస్థలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టడంపైనే వికసిత్ భారత్ తర్వాతి దశ ఆధారపడి ఉందని చెప్పారు. వికసిత్ భారత్ ఆవిష్కరణలో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు. 'వచ్చే పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు, శక్తిమంతమైన ఆవిష్కరణలు, పరిపాలనలో మరింత సరళత అనే మూడు లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం ఇస్తాం. స్థిరమైన సంస్కరణలు, ప్రైవేటు రంగంలో ధైర్యంగా పెట్టుబడులు పెట్టడం, మౌలిక వసతుల కల్పనను కొనసాగించటం, డిజిటల్ పరివర్తనలపైనే దేశ వృద్ధి ఆధారపడి ఉంది. ప్రాథమిక స్థాయి నుంచి సంస్కరణలు చేపట్టడం వల్లనే నేడు ప్రపంచానికి భారత్ డిజిటల్ లీడర్‌గా ఎదిగింది. డాటా సెంటర్లు యువతకు భారీగా ఉద్యోగాలు కల్పించగలవు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను మనదేశంలో డాటా సెంటర్లు ఏర్పాటుచేసేందుకు ఆహ్వానిస్తున్నాం. తర్వాతి తరం టెక్నాలజీ విప్లవానికి నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

### మా ప్రతి బడ్జెట్ ప్రత్యేకమే..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో కలిపి తాను గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వాధినేతగా ఉన్నానని మోదీ గుర్తు చేశారు. ఈ 25 ఏళ్లలో తాము రూపొందించిన ప్రతి బడ్జెట్ దేశాభివృద్ధిలో దేనికదే ప్రత్యేకమైనదని తెలిపారు. ఒక్కటి కూడా సాదాసీదా బడ్జెట్ కాదని పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా స్వల్పకాలిక లక్ష్యాలతో రూపొందించినది కాదని, దేశ దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రూపొందించినదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మన రక్షణ రంగాన్ని ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. అందులో భాగంగానే 2026-27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి నిధులు పెంచినట్లు చెప్పారు. కాగా, ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. చాలా జాగ్రత్తగా రూపొందించిన స్క్రిప్టు ప్రకారం ఇంటర్వ్యూ సాగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ప్రధాని పబ్లిసిటీ స్టంటులో ఇదో భాగమని ఎద్దేవా చేశారు.

# ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ఉండాల్సిందే!

➢ మొదటి పేజీ తరువాయి

కొవ్వు పదార్థాలు ఎంతమేర ఉన్నాయో తెలిపే 'ముందు వైపు హెచ్చరిక లేబుళ్ల' విషయంలో ఎఫ్ఎ?సఎ?సఏఐ దాఖలు చేసిన అఫిడవిట్‌పై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్యాకెట్లపై స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పేర్కొంది. పిటిషనర్ తరఫు న్యాయవాదివాదిస్తూ.. ప్యాకెట్లపై చక్కెర, సోడియం, కొవ్వుల మోతాదు గురించి బోల్డ్ అక్షరాలతో హెచ్చరికలు ఉంటేనే ప్రజలు అప్రమత్తం అవుతారని కోర్టుకు తెలిపారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. కేవలం చర్చలు, సమావేశాలతో కాలక్షేపం చేయొద్దని ఎఫ్ఎ స్ఎ?సఏఐకి సూచించింది. ఈ అంశానికి సంబంధించి 4వారాల్లో సమగ్ర నివేదికతో రావాలని ఆదేశించింది.

# స్పీకర్ తొలగింపుపై 9న చర్చ

➢ మొదటి పేజీ తరువాయి

చేపట్టాలనేది సభా నిబంధనగా రిజిజు పేర్కొన్నారు. వచ్చే నెల 9 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే మలివిడత సమావేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని.. ముఖ్యమైన బిల్లులతో పాటు ఓ కీలక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు.ఆ బిల్లేమిటో ఇప్పుడే బహిర్గతం చేయబోమన్నారు. తొలి విడతలో మాదిరిగానే ఈసారి కూడా సభా కార్యకలాపాలను విపక్షాలు అడ్డుకుంటే.. అది వాటికే నష్టం చేస్తుందని హెచ్చరించారు. లోక్‌సభలో ఐదు శాఖలు, రాజ్యసభలో మరో ఐదు శాఖల బడ్జెట్‌కు సంబంధించిన డిమాండ్లపై చర్చ జరుగుతుందన్నారు. సభలు నడవడానికి విపక్షాలు సహకరించకపోతే గిలెటిన్ చేసుకుపోతామని హెచ్చరించారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాల అసెంబ్లీలకు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్లో ఎన్నికలు జరగనున్నాయని గుర్తుచేశారు. కీలకమైన బిల్లు సహా ముఖ్యమైన బిల్లులు తెచ్చి వాటన్నిటినీ ఆమోదింపజేసుకుంటామని తెలిపారు. జమిలి ఎన్నికల బిల్లేనా అడుగగా.. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని.. పార్లమెంటరీ కమిటీ తన నివేదికకు ఇంకా తుది రూపం ఇవ్వలేదని చెప్పారు. చర్చలో పాల్గొనకుంటే విపక్షాలకే నష్టమని పునరుద్ఘాటించారు. వాటి మధ్య ఐక్యత లేదన్నారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానంపై టీఎంసీ సంతకం చేయలేదని గుర్తుచేశారు.

### తారిఖ్ రహ్మాన్ ప్రమాణ స్వీకారానికి ఓం బిర్లా

బంగ్లాదేశ్ ప్రధానిగా ఫిబ్రవరి 17న ప్రమాణస్వీకారం చేయనున్న తారిఖ్ రహ్మాన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఢాకాలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీని బంగ్లాదేశ్ ఆహ్వానించింది. అయితే స్పీకర్ ఓం బిర్లా భారత ప్రభుత్వం తరఫున ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని విదేశీ వ్యవహారాల శాఖ ఆదివారం తెలిపింది.

# 2.7 కిలోల బంగారాన్ని కాజేసిన మేనేజర్

➢ మొదటి పేజీ తరువాయి

దీంతో బెంగళూరులోని ఓ జాతీయ బ్యాంక్‌కు చెందిన అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ కుమార్(34)ను అరెస్టు చేశారు. బ్యాంక్ కస్టమర్లకు చెందిన 2,783 గ్రాముల బంగారం దొంగతనానికి గురైందని దర్యాప్తులో తేలింది. నిందితుడు లాకర్ కీలను దుర్వినియోగం చేశాడని, బ్రాంచ్ మేనేజర్ లేని సమయాల్లో.. కొంతకాలంగా తాకట్టు పెట్టిన బంగారాన్ని క్రమంగా దొంగలిస్తున్నాడని తెలిసింది.

# పెద్దపల్లి మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ పట్టు

- చైర్మన్ పదవిపై నూగిళ్ల మల్లయ్య పేరు ఖరారు దశలో
- వైస్ చైర్మన్‌గా ఈర్ల స్వరూప ఎంపిక వెనుక వ్యూహం
- ఎమ్మెల్యే మార్క్ రాజకీయాలకు మరో ఉదాహరణ





పెద్దపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 15 అక్షరం న్యూస్;

పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యత సాధించగా, ఇప్పుడు ఆ విజయం పవర్ స్ట్రక్చర్గా మారే దశకు చేరుకుంది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మాత్రమే మిగిలి ఉండగా, ఈ పదవుల ఎంపిక వెనుక రాజకీయ లెక్కలు, సామాజిక సమీకరణలు, భవిష్యత్ రాజకీయ లక్ష్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

బీసీ కోటా ం సంఖ్యాబలం మల్లయ్యకు చైర్మన్ పీఠం

పెద్దపల్లి మున్సిపాలిటీలో చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గానికి కేటాయించబడటం కీలక మలుపు. ఈ కోటా పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 24వ వార్డు సభ్యుడు నూగిళ్ల మల్లయ్య అన్ని విధాలా సరైన ఎంపికగా మారారు.

ఒకవైపు సామాజిక వర్గ సమతుల్యత, మరోవైపు కౌన్సిలర్లలో మెజారిటీ మద్దతు మల్లయ్యకు అనుకూలంగా ఉండటం ఆయనకు బలంగా మారింది. అంతేకాకుండా, పార్టీ లోపలి విభేదాలు లేకుండా ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకునే ప్రయత్నం కాంగ్రెస్ హైకమాండ్ దిశగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

### ఎమ్మెల్యే చింతకుంట విజయరామరావు వ్యూహం ఏమిటి?

ఈ మొత్తం ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్నది చింతకుంట విజయరామరావునే అన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీలో భవిష్యత్తులో ఎలాంటి అసంతృప్తి రాకుండా, పార్టీని క్రమబద్ధంగా న డి పి ం చ గ ల నాయకత్వం అవసరమన్న ఆలోచనతోనే మల్లయ్య పేరును ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఇది కేవలం పదవుల పంపకం కాదు, రాబోయే రాజకీయాలకు పునాది వేయడమే అన్న విశ్లేషణ వినిపిస్తోంది.

### వైస్ చైర్మన్‌గా ఈర్ల స్వరూప... సమతుల్యత రాజకీయమా?

చైర్మన్ పదవి ఒక సామాజిక వర్గానికి దక్కుతుండగా, మరోవైపు వైస్ చైర్మన్ పదవిని ఈర్ల స్వరూపకు ఇవ్వడం ద్వారా పార్టీలో సమతుల్యత సాధించాలన్న ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం, పార్టీ పట్ల విధేయత, స్థానిక రాజకీయాల్లో పట్టు --- ఇవన్నీ స్వరూపకు ప్లస్ పాయింట్లుగా మారాయి. దీంతో కాంగ్రెస్ లోపలి అసంతృప్తులకు తావు లేకుండా వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### పదవుల కంటే పాలనపై దృష్టి పెట్టే ప్రయత్నం

ఈసారి పెద్దపల్లి మున్సిపల్ పాలనలో పదవుల కంటే స్థిరత్వం, నియంత్రణ, పాలన సామర్థ్యం ముఖ్యమన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎవరు గొడవ పెట్టుకోకుండా, పార్టీకి నష్టం రాకుండా, ఎమ్మెల్యే ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వాన్ని ఎంపిక చేయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

### నేటి ఎన్నికలతో రాజకీయ దిశ స్పష్టం

సోమవారం జరిగే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలతో పెద్దపల్లి మున్సిపల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. ఇది కేవలం మున్సిపాలిటీ స్థాయి మార్పే కాకుండా, పెద్దపల్లి నియోజకవర్గ రాజకీయాలకు సంకేత నిర్ణయంగా మారనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఎన్ టి పి సి లో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 15 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం ఎన్టిపిసి పరిధిలోని శివాలయాలలో తెల్లవారుజామున నుండి జరిపిన ప్రత్యేక పూజల లో భక్తులు పాల్గొని శివనామాలతో మార్మోగించారు, స్థానిక పేర్మినెంట్ టౌన్ షిప్ లో గల శివాలయంలో తెల్లవారుజాము నుండి ఆలయ వేద పండితులు రాంపల్లి వామన శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం మహా రుద్రాభి షేకం అర్చనలు తోపాటు జరిపిన ప్రత్యేక పూజలకు వివిధ





ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు, వీటితో పాటు ఎన్ టి పి సి పరిధిలోని మేడిపల్లి రోడ్డు రామాలయం, కృష్ణానగర్ కాలనీ రాధాకృష్ణ దేవాలయం ఎఫ్ సి ఐ టౌన్షిప్ లో గల శివాలయం లో జరిపిన ప్రత్యేక పూజలకు భక్తులు భారీ సంఖ్యలో తరలించారు, ఈ సందర్భంగా శివాలయాలలో ప్రత్యేక అలంకరణ అనేది పూజలు నిర్వహించారు, అదేవిధంగా మహా శివరాత్రి సందర్భంగా సమీప గోదావరి నది లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుండి భారీ గతంలో వచ్చి గోదావరి నదిలో పుణ్య స్థానాలు ఆచరించారు

## రాష్ట్రస్థాయి సీఎం కప్ బేస్ బాల్ పోటీలకు గాయత్రి విద్యార్థులు




పెద్దపల్లి టౌన్ ఫిబ్రవరి 15 అక్షరం న్యూస్

గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ఆదివారం రోజున సుల్తానాబాద్ లొ సీఎం కప్ 2025 జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలలో గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు జె. సాత్విక, ఏ. లాస్య ప్రియ, జి. వెన్నెల ఉత్తమ ప్రతిభ చాటారు. నేటి 16 నుండి 20 వరకు హైదరాబాదు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దపెల్లి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ బాధ్యులు పి. వెంకట ఉమాపతి, పెద్దపల్లిటాగ్ అఫ్ వార్ జిల్లాఅసోసియేషన్ ప్రెసిడెంట్ ఆలేటి సంపత్, పెద్దపెల్లి జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ వాసు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ఎంపిక పట్ల గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యార్థులకు అభినందన తెలిపి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్ మరియు వాయామ ఉపాధ్యాయుడు అజయ్ కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు వెల్ది మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక



జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), పిబ్రవరి 15:

జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం కప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభకనబర్చి మండలంలోని వెల్ది మోడల్ స్కూల్కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తొమ్మిదవ తరగతి విద్యార్థి సిద్దార్థ గౌతమ్ కరాటేలో 14 సంవత్సరాల విభాగం, 50 కిలోల గ్రూపులో విజయం సాధించగా, ఇంటర్ సెకండ్ ఇయర్ సిఈసి గ్రూపు విద్యార్థి గొల్లూరి చందు 800 మీటర్ల రన్నింగ్ ఈవెంట్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఈ నెల 21 నుండి 24 వరకు హైదరాబాద్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు మోడల్ స్కూల్ పిఈటి మారపాక రాజయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన సిద్దార్థ గౌతమ్, గొల్లూరి చందును మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్, ఉపాద్యాయులు కందగట్ల గణేష్, రుద్రమదేవి. జయశ్రీ, రాజు, దీనిల, బాలరాజు, తుమ్మ రవి తదితరులు అభినందించారు

## శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం



కరీంనగర్/చిగురుమామిడి/ఫిబ్రవరి 15 (అక్షరం న్యూస్)

మహా శివరాత్రి పురస్కరించుకుని చిగురు మామిడి మండల వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణలతో ఆలయాల ప్రాంగణాలు మార్మోగి పోయాయి. పరమేశ్వరుడిని దర్శించుకొని భక్తులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని శివాలయంలో రాష్ట్ర బిసి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఇందుర్తి గ్రామంలోని శ్రీ భవాని శంకర ఆలయంలో, మరియు సుందరగిరి గ్రామంలోని పురాతన శివాలయంలో మేకువ జాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శివుడికి రుద్రాభిషేకం, శివపార్వతుల కళ్యాణం, హోమం, ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పిటిసి గికురు రవీందర్, ఆయాగ్రాముల సర్పంచ్లు జంగా శిరీష, ఆకవరం భవాని, చింతపూల నరేందర్, వార్డు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవి స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు




జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఫిబ్రవరి 15:

మండలంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీమహాదేవ స్వామి ఆలయం. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాలలో భక్తులు భక్తిశ్రద్దలతో మహా శివునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించడంతో మహాశివరాత్రి ఉత్సవ శోభ సంతరించుకుంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి పూట జాగారం ఉండే భక్తుల సౌకార్యర్థం ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి లగిశెట్టి లింగయ్య, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కూరెళ్ల రేణుక, పోకల లావణ్య, ఉష, కూరెళ్ల చిన్నఉపేందర్, గందె లిరిల్ కుమార్, పోకల శివకుమార్, బచ్చు చిరంజీవులు, శ్యాంశెట్టి శ్రీనివాస్, సోమేశ్వర్, గందే రవి,వేదకుమార్, వినయ్ కు మార్, ఆలయ పూజారీ పిండిప్రోలు శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు

## రామలింగేశ్వర స్వామి ని దర్శించుకున్న డిసిపి దంపతులు



ఓదెల/ పెద్దపల్లి ఫిబ్రవరి 15(అక్షరం న్యూస్)

మహాశివరాత్రి సందర్భంగా నూతనంగా నూతన ఓరవడితో ఇటీవల కొత్తపల్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయం ఎంతో సుందరీకరణతో నిర్మాణం చేయడం జరిగింది ఈ ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి దంపతులు దర్శించుకొని స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు డిసిపి వెంట సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి ఎస్సై దీకొండ రమేష్ ఉన్నారు పోత్కపల్లి గ్రామంలోని శ్రీ భవాని సమేత మహాలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం “ఓం నమః శివాయ” నినాదాలతో మారుమోగింది. మహిళలు, యువత, వృద్ధులు కుటుంబ సమేతంగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ వారికి ఆశీర్వాదాలు అందజేశారు. డీసీపీ మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం మనసుకు ఆధ్యాత్మిక శాంతిని, సమాజానికి ఐక్యతను అందించే పవిత్ర సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జి. సుబ్బారెడ్డి, ఎస్సై రమేష్. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొని భక్తులకు భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తుల సహకారంతో కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. మహా శివరాత్రి ఉత్సవాలు పోత్కపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి.

# శివనామస్మరణతో మార్మోగిన మల్లన్న ఆలయం

- **మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వీఐపీల తాకిడి**

ఓదెల/ పెద్దపల్లి ఫిబ్రవరి 15(అక్షరం న్యూస్ )

ఓదెల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు తెల్లవారుజామునుండే దర్శనానికి బారులు తీరారు



అదేవిధంగా మహాశివరాత్రి సందర్భంగా మల్లన్న ఆలయానికి విఐపి ల దర్శనం కూడా ఎక్కువనే ఉన్నదని చెప్పవచ్చు మహాశివరాత్రి సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణు డిసిపి రామ్ రెడ్డి సీఐ సుబ్బారెడ్డి ఎస్సై దికొండ రమేష్ లు సతీ సమేతంగా హాజరై మల్లికార్జున స్వామి కి అభిషేకాలు అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన అధికారులకు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శాలువులతో సన్మానం చేసి స్వామి వారి చిత్రపటాన్ని బ ప ు క ర ిం చా రు





అంతేకాకుండా పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద శైవ పుణ్యక్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఈ ఆలయానికి మహాశివరాత్రి పురస్కరించుకొని వివిధ జిల్లాల నుండి వివిధ గ్రామాల నుండి అధికంగా భక్తులు



హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు అదేవిధంగా సాయంత్రం ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తనంతరం స్పర్శ దర్శనం ఉంటుందని ఆలయ ఈవో బి సదయ్య పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లను సన్మానించిన ఎమ్మెల్యే

- **చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



చొప్పదండి /కరీంనగర్, ఫిబ్రవరి 13 (అక్షరం న్యూస్ )

చొప్పదండి పురపాలక సంఘము ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సన్మానించారు. చొప్పదండి పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చొప్పదండి పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచి పట్టణం లోని 14 వార్డుల్లో 10 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారని, కాబట్టి ప్రజల మన్ననలు పొందే విధంగా కౌన్సిలర్ శ్రీబ వుండాలని, రాబోయే ఈ అయిదేళ్లలో ఎక్కడా అధికార దర్పం చూయించవద్దని కౌన్సిలర్ లకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లుగా గెలిచిన కౌన్సిలర్ లు 1 వ వార్డు వడ్లూరి సునీత, 2 వ వార్డు – కొట్టి సునీత, 4 వ వార్డు – కనమల్ల రాజశేఖర్, 5 వ వార్డు – వడ్లూరి అనూష, 6 వ వార్డు – ఓలుగోత్తుల సురేష్, 9 వ వార్డు – గుర్రం రాజేందర్ రెడ్డి, 10 వ వార్డు – గుర్రం సుజిత్ రెడ్డి, 11 వ వార్డు – పిట్టల వెంకటేష్, 12 వ వార్డు – ముద్దం రాజేశ్వరి, 14 వ వార్డు – పెరుమాండ్ల మానస లను ఎమ్మెల్యే సన్మానించారు.

## భక్తులతో కిటికీటలాడిన రామంచ గుట్ట



కరీంనగర్ /చిగురు మామిడి/ఫిబ్రవరి 15 (అక్షరం న్యూస్)

చిగురుమామిడి మండలం రామంచ గ్రామం లో రామంచ గుట్ట పైన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటికీటలాడిన,శివ నామ స్మరణతో రమంచ గుట్ట మార్మోగింది. అతి పురాతన కాల ఆలయం ఇక్కడ దాదాపు 700 కాలం నాటి ఆలయం ఇక్కడ శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడాం జరిగింది ఇక్కడకి చుట్టుపక్కల నుండి తండోప తండాలుగా తరలి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎండ నుంచి భక్తులకు ఇబ్బంది కలగకుండా సీలింగ్ టెంట్లు వేయించారు. అన్ని వసతులు కల్పించారు. భక్తులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే శివ పార్వతి ల కళ్యాణం మరియు పల్లకిలో ఊరేగింపు జరిపించినారు. సర్పంచ్ కిషన్ రెడ్డి మరియు ఆలయ కమిటి సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నేడు ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు.

## శివాలయ రహదారికి మహర్దశ..

- **ట్రాక్టర్ యజమానుల నిస్వార్థ సేవకు కమిటీ సన్మానం**
- **శివాలయ దారికి సొంత ఖర్చుతో మరమ్మతులు**



కరీంనగర్, తిమ్మాపూర్ ఫిబ్రవరి 15 (అక్షరం న్యూస్)

తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోని శివాలయానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై, భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన విషయాన్ని గమనించిన పలువురు ట్రాక్టర్ యజమానులు 'మేమున్నామంటూ' స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన బోనాల సంపత్, మడ్డి కుమార్, బత్తిని అనిల్, పత్రి రవి, కండే ఎల్లయ్య, పాశం వెంకటేష్, కీసర చందు, పాశం రాజ కొమురయ్య, పత్రి మహేష్ తమ సొంత ఖర్చులతో, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి చదును చేశారు. వారు చేసిన ఈ నిస్వార్థ సేవను గుర్తించిన శివాలయ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆలయ ప్రాంగణంలో ట్రాక్టర్ యజమానులను శాలువతో ఘనంగా సన్మానించారు. ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా, భక్తుల ప్రయాణం సులభతరం చేసేందుకు వారు పడ్డ శ్రమను గ్రామస్తులు కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో స్పందించి రహదారిని బాగు చేసిన ట్రాక్టర్ యజమానులు అందరికీ ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వారు కోరారు. ట్రాక్టర్ యజమానుల చొరవపై భక్తులు మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు విద్యార్థులు ఎంపిక



రాయపోల్ : సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి, రాయపోల్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సీఎం కప్ వాలీబాల్ ( ఎశీశ్రీశ్రీవఎ దీఘశ్రీశ్రీ ) క్రీడలకు ఎంపికైనట్లు పీడీ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన గుంటుకు భరత్, బంటు అనిల్ జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ ( ఎశీశ్రీశ్రీవఎ దీఘశ్రీశ్రీ ) క్రీడోత్సవాల్లో ప్రతిభను కనబరిచినందుకు అభినందిస్తూ వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని అనాజీపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి బి. ప్రణయ్ సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నిర్మల, గోవర్ధన్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికై పాఠశాల , గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

## నేడు ఎన్టిపిసి ట్యాక్సీ డ్రైవర్ల సమ్మె

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 15 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి ప్రాజెక్టులో కొనసాగుతున్న అద్దె వాహనాల డ్రైవర్లకు పెరిగిన వేతనాలను చెల్లించడం లేదని సోమవారం నుండి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్ తెలిపారు, ఎన్టిపిసి అద్దె వాహనాల యజమానులతో మూడు నెలల క్రితం కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం డ్రైవర్లకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అందుకోసం సోమవారం నుండి సమ్మెలో వెళ్తున్నట్లు తెలిపారు.. యజమాలు దిగివచ్చి చర్చలు జరిపి వేతనాలు పెంచే వరకు సమ్మె కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ఎన్టిపిసి టెండర్లలో డ్రైవర్ల వేతనాలు అలవెన్సులు ఇచ్చే విధంగా చూసుకునే టెండర్ వేయాలని ఎన్నిసార్లు చెప్పినా కాంట్రాక్టర్లు వినడం లేదని అన్నారు. తక్కువ రేటుకు వేసుకోవడం డ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలంటే మొండి చేయి చూపడం అలవాటైందని ఆయన అన్నారు. ఎన్టిపిసి లోని వివిధ రకాల పనులు చేసే కాంట్రాక్టర్లు కూడా మైనస్ టెండర్లు వేసుకోవడం తగ్గించాలని ఆయన అన్నారు. ఈరోజు ప్రతి కార్మికులు జీవన ప్రమాణాలు పెరిగిపోయాయని ఇంటి అద్దెలు స్కూలు ఫీజులు వైద్యం ఖర్చులు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయిన తరుణంలో జీతాలు పెరగక తప్పదని ఆయన అన్నారు.

## మున్సిపల్ గవర్నమెంట్ హైస్కూల్‌లో 69 శాతం ఉత్తీర్ణత



పెద్దపల్లి రూరల్ ఫిబ్రవరి 11 అక్షరం న్యూస్;

మున్సిపల్ గవర్నమెంట్ హైస్కూల్, గంగానగర్ ఉపశాఖకు చెందిన విద్యార్థులు ఈ ఏడాది మెట్రిక్ పరీక్షల ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. మొత్తం పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 69 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం పాఠశాల స్థాయిలో గర్వకారణంగా నిలిచింది. హెడ్‌మాస్టర్ విద్యాశేఖర్ గారి నాయకత్వంలో ఉపాధ్యాయ బృందం చేసిన కృషి ఫలితంగా ఈ విజయం సాధ్యమైందని పాఠశాల వర్గాలు వెల్లడించాయి. విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ మాట్లాడుతూ... విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారమే ఈ ఫలితాలకు కారణమని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం అందిస్తున్నారని తెలిపారు.

## మున్సిపల్ పరిధిలో పారిశుధ్య చర్యలు ముమ్మరం

- **డంపింగ్ యార్డ్, చెత్త విభజనపై ప్రత్యేక దృష్టి**



పెద్దపల్లి టౌన్ ఫిబ్రవరి 15 అక్షరం న్యూస్;

మున్సిపల్ నగరసభ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎ.వీ) విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. పట్టణంలో స్వచ్ఛత కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో రోజువారీగా చెత్త సేకరణ, చెత్త విభజన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద వర్మీ కంపోస్టు తయారీ, డ్రై వేస్ట్ షెడ్‌ల నిర్వహణ జరుగుతుండగా, చెత్తను యథేచ్ఛగా పడేయకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ చర్యలతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, కాలుష్య సమస్యలు తగ్గుముఖం పట్టాయని అధికారులు తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో మున్సిపల్ అధికారులు, వీవీ సిబ్బంది, డ్రైవర్లు, బీట్ వర్కర్లు, స్వచ్ఛత మిత్రులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను వేరు చేసి అందజేయడం ద్వారా సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమాలకు హెచ్.ఎం. విభాగ సిబ్బంది, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు విశేషంగా సహకరిస్తున్నారని మున్సిపల్ వర్గాలు వెల్లడించాయి.

# కదులుతున్న కారుపై కూలిన భారీ స్తంభం.. ఎస్పీ నేత మృతి

లక్నో: రోడ్డుపై వెళ్తున్న కారుపై హై-మాస్ట్ బిల్‌బోర్డ్ స్తంభం కూలింది. ఆ కారు నడుపుతున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నేత ఈ ప్రమాదంలో మరణించారు. ఈ సంఘటన చూసి స్థానికులు షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం అంటూ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుగంజ్ మార్కెట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కొత్తగా హై-మాస్ట్ బిల్‌బోర్డ్ ఏర్పాటు చేస్తున్నారు.కాగా, ఆ రోడ్డుపై ఒక కారు వెళ్తున్నది. అయితే కొత్తగా నిర్మిస్తున్నహై-మాస్ట్ బిల్‌బోర్డ్ పోల్ కూలిపోయింది. కదులుతున్న కారుపై అది పడింది. కారు డ్రైవ్ చేస్తున్న 48 ఏళ్ల ఎస్పీ నేత లాల్ బహదూర్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే ఆయన మరణించారు.మరోవైపు పోలీసులు, స్థానిక అధికారులు అక్కడకు చేరుకున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.




ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.


# పరిశ్రమలకు పవర్ హాలిడే!.. పారిశ్రామికవాడల్లో నిత్యం విద్యుత్తు కోతలు

- ముందస్తు సమాచారం ఇవ్వకుండా కరెంటు కట్
- ఉత్పత్తులపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- ఆందోళనలో పారిశ్రామికవేత్తలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 రాష్ట్రంలో ఈసారి వేసవి మొదలు కాకముందే పరిశ్రమలకు కరెంటు కష్టాలు మొదలయ్యాయి. నిత్యం అప్రకటిత కరెంటు కోతలతో హైదరాబాద్ శివార్లలోని పారిశ్రామికవాడల్లో ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. మెయింటెనెన్స్ పనుల పేరుతో ఇప్పటికే ప్రతి ఆదివారం విద్యుత్తు కోతలు విధిస్తున్న అధికారులు.. వారంలో మిగిలిన రోజుల్లో సైతం అకారణంగా కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో ఎప్పుడు కరెంటు పోతుందో అర్థంకాక పరిశ్రమల నిర్వాహకులు సతమతమవుతున్నారు. నాణ్యమైన కరెంటు సరఫరా కోసం ప్రతి ఆదివారం పారిశ్రామికవాడల్లో విద్యుత్తు శాఖ సిబ్బంది నిర్వహణ పనులు చేపట్టడం ఆనవాయితీ.తెలంగాణ వార్తలుఅది సెలవుదినం కావడంతో ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం ఉండదు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటినుంచి ఈ విధానం గాడితప్పింది. నిర్వహణ పనులు తూతూమంత్రంగా చేస్తుండటంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం మరమ్మతుల పేరిట ఇంచుమించు ప్రతి రోజూ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. అలా గత వారం రోజుల్లో జీడిమెట్లలో రెండుసార్లు గంట చొప్పున కరెంటు పోయింది. చర్లపల్లి, బాలానగర్, నాచారంలో మూడుసార్లు, మల్లాపూర్, ఉప్పల్ పారిశ్రామికవాడల్లో ఒకసారి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

పాడవుతున్న యంత్రాలు, ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం

ముందస్తు సమాచారం లేకుండా కరెంటు నిలిపివేస్తుండటంతో యంత్రాలు పాడవుతున్నాయని, మోటర్లు కాలిపోయే ప్రమాదం ఉన్నదని పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. యంత్రాలు నడుస్తున్నప్పుడు అకస్మాత్తుగా కరెంటు సరఫరా నిలిచిపోతే ఉత్పత్తుల నాణ్యత తగ్గిపోతుందని, ముఖ్యంగా ప్లాస్టిక్ పరిశ్రమల్లో ప్లాస్టిక్ గడ్డకట్టి వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. పరిశ్రమల్లో బాయిలర్లు చల్లారిపోయి మళ్లీ వేడెక్కేందుకు ఎంతో సమయం పడుతుందని, కనీసం అర్ధగంట సేపు విద్యుత్తు నిలిచిపోయినా.. మళ్లీ ఉత్పత్తి మొదలయ్యేందుకు రెండు గంటల సమయం పడుతుందని చెప్తున్నారు.

వాస్తవానికి ఈ ఏడాది భారీ వర్షాల వల్ల జూన్, జూలై, ఆగస్టు మాసాల్లోనూ నిత్యం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఏదో ఒక ప్రాంతంలో చెట్లు కూలడం, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం జరగడం వంటి ఘటనలతో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక కరెంటు సరఫరా కాస్త గాడిలో పడినప్పటికీ గత నెలరోజులుగా మళ్లీ విద్యుత్తు కోతలు మొదలయ్యాయి.

## విద్యుత్తు పరికరాల కొరత

రాష్ట్ర విద్యుత్తు శాఖ ఇప్పటికే పరికరాల కొరతతో సతమతమవుతున్నట్టు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్తు సరఫరా నియంత్రణ, క్రమబద్ధీకరణ లాంటి పనుల కోసం ఉపయోగించే ఆల్టర్నేటింగ్ కరెంట్ (ఏసీ), డైరెక్టర్ కరెంట్ (డీసీ) రెక్టిఫయర్లు, ఫిల్టర్లు, ఓల్టేజ్ రెగ్యులేటర్లు తదితర పరికరాలు లేక పాత పరికరాలనే కొనసాగిస్తుండటంతో రోజూ మరమ్మతులు తప్పడం లేదు. దీంతో విద్యుత్తు సరఫరా సక్రమంగా సాగడంలేదు.

## మళ్లీ పాత రోజులు

స్వరాష్ట్ర ఆవిర్భావానికి ముందు నిత్యం కరెంటు కోతలతో తెలంగాణ తీవ్రంగా సతమతమైంది. ముఖ్యంగా వేసవి కాలంలో వారానికి 2-3 రోజులు అధికారికంగానే పవర్ హాలిడేలు ఉండేవి. పగటిపూట కరెంటు కోతలు విధించి, రాత్రి వేళల్లో మాత్రమే విద్యుత్తు సరఫరా చేసేవారు. దీంతో ప్రతి పరిశ్రమ తప్పనిసరిగా జనరేటర్లను ఏర్పాటు చేసుకునేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ ఆ కష్టాలకు తెరదించి, పదేండ్లపాటు కరెంటు కోతలు లేకుండా చేయడంతో పరిశ్రమల్లో జనరేటర్లు కనుమరుగయ్యాయి. కానీ, ప్రస్తుత కరెంటు కోతలు చూస్తుంటే పాత రోజులు గుర్తొస్తున్నాయి. దీంతో తాము మళ్లీ జనరేటర్లను ఏర్పాటు చేసుకోక తప్పదని పారిశ్రామిక వర్గాలు చెప్తున్నాయి.

# 17న ఆకాశంలో అద్భుతం.. 'రింగ్ ఆఫ్ ఫైర్' ఆవిష్కృతం

ఆ రోజు వలయాకార సూర్యగ్రహణం ఏర్పడనుంది. దీన్ని 'రింగ్ ఆఫ్ ఫైర్ (అగ్ని వలయం)' అని పిలుస్తారు. ఈ రింగ్ ఆఫ్ ఫైర్ ఆకాశంలో అద్భుతంగా కనిపించనుంది. అయితే ఈ అరుదైన ఖగోళ అద్భుతాన్ని భారతదేశంలో వీక్షించే అవకాశం లేదు. ఇది ప్రధానంగా దక్షిణార్ధ గోళంలో, అదీ అత్యంత మారుమూల ప్రాంతంలో మాత్రమే సంపూర్ణంగా కనిపించనుంది.సాధారణంగా సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు వచ్చినప్పుడు సూర్యగ్రహణం ఏర్పడుతుంది. అయితే ఈ గ్రహణం సమయంలో చంద్రుడు తన సాధారణ పరిమాణం కంటే కొంచెం చిన్నగా కనిపించడంవల్ల సూర్యుడిని పూర్తిగా కప్పలేడు. సూర్యుడి మధ్య భాగాన్ని కేవలం 96 శాతం మాత్రమే అడ్డుకుంటాడు. దాంతో సూర్యుడి అంచులు ఒక ప్రకాశవంతమైన బంగారు వలయంలా కనిపిస్తాయి. దీన్నే కంకణాకార గ్రహణం లేదా 'రింగ్ ఆఫ్ ఫైర్' అంటారు.ఈ అగ్ని వలయం గరిష్టంగా 2 నిమిషాల 20 సెకన్ల పాటు కనువిందు చేయనుంది. ఖుజ కాలమానం ప్రకారం ఫిబ్రవరి 17న ఉదయం 07:01 గంటలకు గ్రహణం ప్రారంభమవుతుంది. ఈ



సంపూర్ణ 'రింగ్ ఆఫ్ ఫైర్' గ్రహణం అంటార్కిటికా ఖండంలో మాత్రమే స్పష్టంగా కనిపిస్తుంది. అక్కడి కాంకార్డియా, మిర్నీ వంటి పరిశోధనా కేంద్రాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, సిబ్బంది మాత్రమే ఈ అద్భుతాన్ని ప్రత్యక్షంగా చూడగలరు. ఆ ప్రాంతాలు సాధారణ పర్యాటకులకు అందుబాటులో ఉండవు.అయితే, దక్షిణాఫ్రికా, టాంజానియా, జింబాబ్వే వంటి ఆఫ్రికా దేశాలతోపాటు అర్జెంటీనా, చిలీ వంటి దక్షిణ అమెరికా దేశాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. భారతదేశంలో ఈ గ్రహణం సంభవించే సమయంలో సూర్యుడు దిగంతం కింద ఉంటాడు. కాబట్టి ఇక్కడ పాక్షికంగా కూడా గ్రహణాన్ని చూసే అవకాశం లేదు. అయితే నాసా (చీూూూ) వంటి అంతరిక్ష సంస్థలు ప్రసారం చేసే ఆన్‌లైన్ లైవ్ స్ట్రీమ్‌ల ద్వారా భారతీయులు ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించవచ్చు.గ్రహణాన్ని ప్రత్యక్షంగా చూసేవారు తప్పనిసరిగా ప్రత్యేకమైన సోలార్ ఫిల్టర్ కళ్లద్దాలు వాడాలి. నేరుగా చూడటం కళ్లకు తీవ్ర హాని కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# 1కరెంట్ షాక్‌కు రైతు బలి.. నారాయణపేట జిల్లా పగిడిమర్రిలో విషాదం



ఊట్కూర్, ఫిబ్రవరి 15 : కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మం డలం పగిడిమర్రిలో విషాదాన్ని నింపింది. స్థానికులు, ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మగ్దూంఅలీ (54) తిప్రాస్‌పల్లి శివారులో వేరుశనగ సాగు చేశాడు. శనివారం పొ లానికి నీరు పారబెట్టేందుకు వెళ్లిన రైతు రాత్రి 9 గంటలు దాటినా ఇంటికి రాలేదు.భార్య షాహిన్‌బేగం అతనికి ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి బావ మౌలాలీ, మరో వ్యక్తి అశోక్‌తో కలిసి పొలం వద్దకు వెళ్లింది. అడవి పందుల బెడద నుంచి పంట రక్షణ కోసం అమర్చిన ఎలక్ట్రిక్ ఫెన్సింగ్‌కు ప్రమాదవశాత్తు రైతు కాలు తగిలి విద్యుదాఘాతానికి గురై పడి ఉన్నా డు. వెంటనే దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించా రు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# రెండేళ్లలో అధికారంలోకి బీఆర్ఎస్

- ఎన్నికల్లో కార్పొరేటర్లు ఇచ్చిన హామీలను పూర్తిచేస్తాం..
- వచ్చే ప్రభుత్వంలో శ్రీనివాస్‌గౌడ్ మంచి హోదాలో ఉంటారు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు



మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 15 : రాష్ట్రం లో వచ్చే రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ గెలుపొందిన కార్పొరేటర్లను అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని తాను రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న సమయంలో ఇదే విషయాన్ని ప్రజలు చెప్తున్నారని గుర్తు చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో మీ డివిజన్‌లో ఇచ్చిన హామీలను పూర్తి చేసేందుకు తప్పకుండా సహకరిస్తామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజా సమస్యలపై పాలక పక్షాన్ని నిలదీయాలని సూచించారు. సిరిసిల్ల, సిద్దిపేటకు దీటుగా మహబూబ్‌నగర్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభివృద్ధి చేశారు. మిగిలిపోయిన పనులను ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ప్రభుత్వంలో మీ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంచి స్థానంలో ఉం టారు. మీ గెలుపు కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారు. శ్రీనివాస్‌గౌడ్‌కు అండగా నిలబడాలన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో చాలా మంది కార్పొరేటర్లు తక్కువ ఓట్లతో ఓడిపోయారు. ఓడిన అభ్యర్థులకు భవిష్యత్‌లో మంచి స్థానం కల్పిస్తామని తెలిపారు.

# బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి.. గురుకుల విద్యార్థులు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: బాలీ(ఇండోనేషియా) వేదికగా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న ఇండో-ఇండోనేషియా బాల్ బ్యాడ్మింటన్ టోర్నీకి రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు బాబునాయక్, శశిధర్ ఎంపికయ్యారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో భారత జట్టు తరఫున బాబునాయక్, శశిధర్ ప్రాతినిధ్యం వహించనున్నారు.

జాతీయస్థాయి టోర్నీల్లో రాణించడం ద్వారా ఈ ఇద్దరు గురుకుల విద్యార్థులు అంతర్జాతీయ టోర్నీకి ఎంపికైనట్లు గురుకుల ప్రతినిధులు పేర్కొన్నారు.

# బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



మంచిర్యాల జిల్లా /?బెల్లంపల్లి /ఫిబ్రవరి 15 /అక్షరం న్యూస్

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీ, ఇంగ్లీష్, తెలుగు, కామర్స్, కంప్యూటర్ సైన్స్, మరియు జువాలజీ సబ్జెక్టులలో ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18వ తేదీ (బుధవారం) సాయంత్రం 4 గంటల లోపు తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### అర్హత వివరాలు:

సంబంధిత సబ్జెక్టులో పీజీ (గ్రా+) లో 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) కలిగి ఉండాలి. పీహెచ్డీ (గ్రాష్ట్రణ) అర్హత ఉన్న వారికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని, వారు లేని పక్షంలో నెట్ (చీజు), ఆ తర్వాత స్లెట్ (గాజు) లేదా సెట్ (రాజు) అర్హత గల వారిని పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. డిగ్రీ స్థాయిలో బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

### వేతనం మరియు ఎంపిక విధానం:

ఎంపికైన అభ్యర్థులకు ఒక్కో పీరియడ్‌కు 390 రూపాయల చొప్పున, నెలకు గరిష్టంగా 28,080 రూపాయల రెమ్యూనరేషన్ లభిస్తుందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జిల్లా ఐడి కళాశాల) లో నిర్వహించడం జరుగుతుందని, ఇంటర్వ్యూ తేదీ మరియు సమయాన్ని అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.

### జతచేయాల్సిన పత్రాలు:

దరఖాస్తుతో పాటు 1వ తరగతి నుండి డిగ్రీ వరకు బోనఫైడ్, కండక్ట్ సర్టిఫికెట్లు, టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్డీ/నెట్/సెట్ ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో పాటు ఆధార్ కార్డు మరియు లోకల్ సర్టిఫికెట్ ప్రతులను జత చేయాలి. ఇతర వివరాలకు 9959269975 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

# బెల్లంపల్లి మున్సిపల్ పీఠం ఎవరిది నేడే చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక

- ఉదయం 11 గంటలకు కౌన్సిలర్ల ప్రత్యేక సమావేశం
- బలాబలాలు సమం.. స్వతంత్రులే కీలకం
- కాంగ్రెస్ విప్ జారీ.. ధిక్కరిస్తే పదవి రద్దు!
- బెల్లంపల్లి మున్సిపల్ పీఠం ఎవరిని వరిస్తుందో చూడాలి!




మంచిర్యాల జిల్లా /బెల్లంపల్లి /ఫిబ్రవరి 15 /అక్షరం న్యూస్-

ఎట్టకేలకు బెల్లంపల్లి మున్సిపాలిటీ నూతన పాలకవర్గ ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికలను ఈ నెల 16వ తేదీ (సోమవారం) ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల ప్రత్యేక అధికారి మనోజ్ ఆదివారం వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఉత్తర్వుల మేరకు ఈ ఎన్నికల ప్రక్రియను ఆయన పర్యవేక్షించనున్నారు.

### హంగ్ మున్సిపాలిటీలో బలాబలాలు

?బెల్లంపల్లి మున్సిపాలిటీలోని మొత్తం 34 వార్డులలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' ఏర్పడింది. ప్రస్తుత బలాబలాలను పరిశీలిస్తే.. కాంగ్రెస్ 14, బిఆర్ఎస్ 14 స్థానాలతో సమానంగా ఉన్నాయి. వీటితో పాటు బిజెపి 01 స్థానాన్ని గెలుచుకోగా, ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. మెజారిటీకి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ అందుకోవడంలో ఈ ఐదుగురు స్వతంత్రులు మరియు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు ఇప్పుడు అత్యంత కీలకంగా మారాయి.

### ఎన్నిక విధానం - కాంగ్రెస్ విప్ జారీ

?ఈ ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. అభ్యర్థిని ఎన్నుకునే క్రమంలో సభ్యులు బహిరంగంగా తమకు నచ్చిన అభ్యర్థికి మద్దతు తెలుపుతూ చేతులెత్తాల్సి ఉంటుంది. మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ తమ కౌన్సిలర్లకు ఇప్పటికే విప్ (ఔష్ట్రఅజూ) జారీ చేసింది. ఈ మేరకు అధికారికంగా ఫారం-1 ను ఎన్నికల అధికారికి అందజేశారు.

### క్రాస్ ఓటింగ్ చేస్తే ఏమవుతుంది

ఒకవేళ ఏ సభ్యుడైనా పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష అభ్యర్థికి ఓటు వేస్తే (క్రాస్ ఓటింగ్), ఆ ఓటు చెల్లుబాటు అవుతుంది కానీ సదరు సభ్యుడిపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడుతుంది. అంటే వారు తమ కౌన్సిలర్ పదవిని కోల్పోవాల్సి ఉంటుంది. దీనివల్ల కౌన్సిలర్లు పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా వెళ్లడం దాదాపు అసాధ్యం కానుంది.

### ముగిసిన ఏర్పాట్లు:

?ఎన్నికల నిర్వహణ కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ ప్రత్యేక సమావేశంలో మొదట చైర్‌పర్సన్, ఆ తర్వాత వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయనున్నారు. రెండు ప్రధాన పార్టీలు సమాన బలంతో ఉండటం, స్వతంత్రులు కింగ్ మేకర్లుగా మారడంతో.. ఈ ఉత్కంఠ పోరులో బెల్లంపల్లి మున్సిపల్ పీఠం ఎవరిని వరిస్తుందో చూడాలి

# శివరాత్రి సందర్భంగా శివాలయాల్లో పూజలు ఆచరించిన రామగుండం ఎమ్మెల్యే దంపతులు







జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 15 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి గోదావరిఖని జనగామలోని శ్రీ త్రిలింగరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో, పవర్ హౌస్ కాలనీ కాశి విశ్వేశ్వర ఆలయం,కోదండ రామలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పరమేశ్వరుని కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఐశ్వర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ప్రజల అభ్యున్నతి, ప్రాంతీయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఈ సందర్భంగా తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రామగుండం నగరపాలక సంస్థ కొత్త కార్పొరేటర్లు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 15 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ తరపున ఘన విజయం సాధించిన 50 మంది కార్పొరేటర్లతో ఆదివారం రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో హైదరాబాదులో గల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి లిలిరేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, గెలుపొందిన ప్రతి ఒక్క కార్పొరేటర్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల విశ్వాసంతో, ప్రజల ఆశీర్వాదంతో వచ్చిన ఈ విజయం కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని సీఎం గారు పేర్కొన్నారు.అలాగే, రాబోయే రోజుల్లో రామగుండం కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీటి సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కార్పొరేటర్లకు సీఎం గారు సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వేగంగా పరిష్కరించే విధంగా పని చేయాలని కోరారు.ఈ భేటీలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, రామగుండం ప్రజలు కాంగ్రెస్ పార్టీపై అపారమైన నమ్మకం ఉంచి విజయాన్ని అందించిన ప్రాంత ప్రజలందరికీ ధన్యవాదాలు చెబుతూ, ఇది పార్టీకి మాత్రమే కాదు, ప్రజాసేవకు కూడా గొప్ప అవకాశం అని తెలిపారు. సీఎం మార్గదర్శకత్వంలో రామగుండం నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరం కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గెలుపొందిన కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజామంత్రి సామాన్య భక్తుడు: మూడు కిలోమీటర్లు నడిచి మల్లన్నను దర్శించుకున్న మంత్రి వివేక్





- వేలాల గట్టు, కత్తెరశాల మల్లన్న జాతరలకు పోటెత్తిన భక్తజనం
- కాన్వాయ్ వదిలి కాలినడకన వెళ్లిన మంత్రి వివేక్ వెంకటస్వామి దంపతులు
- కత్తెరశాల ఆలయ అభివృద్ధికి రూ. 20 లక్షల నిధులు మంజూరు

మంచిర్యాల జిల్లా /చెన్నూరు /ఫిబ్రవరి 15 /అక్షరం న్యూస్

మహాశివరాత్రి పర్వదినం వేళ మంచిర్యాల జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి. జైపూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేలాల గట్టు మల్లికార్జున స్వామి, చెన్నూరు మండలం కత్తెరశాల మల్లన్న జాతరలకు తెలంగాణ, మహారాష్ట్రల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కొండపై వెలసిన మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు.

### సింప్లిసిటీ చాటుకున్న మంత్రి:

రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సరోజమ్మ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తన కాన్వాయ్ వల్ల ట్రాఫిక్‌కు ఆటంకం కలగకూడదని భావించిన మంత్రి, తన వాహనాలను గుట్ట కిందే వదిలివేసి సామాన్య భక్తుడిలా సుమారు 3 కిలోమీటర్లు నడిచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. మంత్రి సింప్లిసిటీని చూసి భక్తులు ఆశ్చర్యపోగా, ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### అభివృద్ధికి నిధుల వరాలు:

దర్శనం అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. వేలాల ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు అటవీ శాఖ అనుమతులు సాధించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి నెలా గిరి ప్రదక్షిణను ప్రారంభించామన్నారు. కత్తెరశాల మల్లన్న ఆలయ అభివృద్ధి కోసం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.?అనంతరం చెన్నూరు పట్టణంలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో మంత్రి పాల్గొని ర్యాలీలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు మరియు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆస్ట్రేలియాతో తొలి టీ20.. భారత మహిళల ఘన విజయం




భారత మహిళా జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా సిడ్నీ వేదికగా ఆసీస్‌తో జరిగిన తొలి టీ20లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో టీమిండియా 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. ఛేదనకు దిగిన భారత్ 5.1 ఓవర్లలో వికెట్ కోల్పోయి 50 పరుగులు చేసింది. ఈ క్రమంలోనే వరుణుడు ఆటకు ఆటంకం కలిగించాడు. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో ఫలితాన్ని డీఎల్ఎస్ పద్ధతిలో అంపైర్లు ప్రకటించారు. వర్షం వచ్చే సమయానికి భారత్ అదనంగా 21 పరుగులు చేసి ఉండటంతో విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో జార్జియా(30) టాప్ స్కోరర్. లిచ్‌ఫీల్డ్(26), ఎలీస్ పెర్రీ(20) పర్వాలేదనిపించారు. ఇతర బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో అరుంధతీ రెడ్డి 4 వికెట్లు తీసి ఆసీస్ పతనాన్ని శాసించింది. శ్రీచరణి, రేణుకా సింగ్ తలో 2, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ చెరొక వికెట్ తీసుకున్నారు. ఛేదనలో వర్షం పడే సమయానికి షఫాలీ వర్మ(21) ఔట్ అవ్వగా.. స్మృతి మంధాన (16లి), జెమీమా రోడ్రిగ్స్(9లి) క్రీజులో ఉన్నారు.

## 'స్వయంభూ' టీజర్‌పై చర్చ రగిలించిన నిఖిల్ పోస్ట్ ..

**ఎవరిని ఉద్దేశించి ఆ కామెంట్ చేశాడు...**



టాలీవుడ్‌లో థ్రిల్లర్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక మార్కెట్ సంపాదించుకున్న యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ ప్రస్తుతం భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ స్వయంభూ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ఇటీవల విడుదలై మంచి స్పందన దక్కించుకుంది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకోవడంతో సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. అయితే టీజర్‌కు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో పాటు మరో అంశం టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టీజర్‌ను ఎణ= క్వాలిటీలో మళ్లీ అప్‌లోడ్ చేసిన సందర్భంగా నిఖిల్ చేసిన ఒక కామెంట్ చర్చకు దారితీసింది. యూట్యూబ్ గ్లిట్జ్‌ల వల్ల టీజర్‌ను మళ్లీ అప్‌లోడ్ చేశాం అని పేర్కొన్న ఆయన, చివర్లో "రీసెంట్‌గా వచ్చిన ఒక సినిమాలా మా చిత్రంలో ఎలాంటి ూ× వినియోగించలేదు అని స్పష్టంగా చెప్పడం విశేషంగా మారింది. ఈ ఒక్క కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిఖిల్ ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్య చేశారనే దానిపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. ఇటీవల విడుదలైన కొన్ని సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్, డీప్‌ఫేక్ టెక్నాలజీ, AI టూల్స్ వినియోగంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో "నిఖిల్ ఏ సినిమాను టార్గెట్ చేశాడు?" అన్న ప్రశ్న సినీ వర్గాల్లో వినిపిస్తోంది.

సినిమా ప్రమోషన్‌లో భాగంగా చేసిన కామెంట్ అయినా, ఇది ఇండస్ట్రీలో టెక్నాలజీ వినియోగంపై మరోసారి చర్చ మొదలయ్యేలా చేసింది. కొందరు నిఖిల్ పారదర్శకతను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది అవసరం లేని పోలిక అని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి టీజర్ కంటే ఎక్కువగా నిఖిల్ చేసిన ఈ AI వ్యాఖ్యే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.'స్వయంభూ' సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిన వేళ, ఈ వివాదం కూడా చిత్రానికి అదనపు ప్రచారం తీసుకువచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దర్శకబృందం మాత్రం కంటెంట్ క్వాలిటీ, విజువల్ గ్రాండియర్‌పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. రిలీజ్ డేట్‌పై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి.. గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, బాలీ(ఇండోనేషియా) వేదికగా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న ఇండో-ఇండోనేషియా బాల్ బ్యాడ్మింటన్ టోర్నీకి రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు బాబునాయక్, శశిధర్ ఎంపికయ్యారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో భారత జట్టు తరఫున బాబునాయక్, శశిధర్ ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయస్థాయి టోర్నీల్లో రాణించడం ద్వారా ఈ ఇద్దరు గురుకుల విద్యార్థులు అంతర్జాతీయ టోర్నీకి ఎంపికైనట్లు గురుకుల ప్రతినిధులు పేర్కొన్నారు.



## టీ20 ప్రపంచ కప్2026: నేపాల్‌పై వెస్టిండీస్ ఘన విజయం




టీ20 ప్రపంచ కప్2026లో భాగంగా నేపాల్ తో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇవాళ(ఆదివారం) ముంబై వేదికగా విండీస్, నేపాల్ జట్లు తలపడ్డాయి. టీ20 ప్రపంచ కప్2026లో భాగంగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్ లో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇవాళ(ఆదివారం) ముంబై వేదికగా విండీస్, నేపాల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కరేబియన్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన వెస్టిండీస్ జట్టు 15.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విండీస్ బ్యాటర్లలో కెప్టెన్ షాయ్ హోప్(61లి), హెట్‌మయర్ (46లి) చెలరేగారు. అలానే బ్రాండన్ కింగ్ 22 పరుగులు చేశాడు.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి133 పరుగులు మాత్రమే చేసింది. నేపాల్ బ్యాటర్లలో దీపేంద్ర సింగ్ ఐరీ (59) అర్ధ సెంచరీ చేశాడు. సోంపాల్ కామి (26 నాటౌట్) రాణించాడు. ఓ దశలో 73 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి నేపాల్ కష్టాల్లో పడింది. ఈ దశలో దీపేంద్ర సింగ్ ఐరీ, సోంపాల్‌లు ఏడో వికెట్‌కు 54 పరుగులు జోడించి ఆదుకున్నారు.ఇక వెస్టిండీస్ బౌలర్లలో జేసన్ హోల్డర్ నాలుగు వికెట్లు సాధించింది. అకేల్ హోసేన్, మాథ్యూ ఫోర్డే, షమర్ జోసెఫ్, రోస్టన్ చేజ్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమితో నేపాల్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అలానే వరుసగా మూడు విజయాలతో విండీస్ జట్టు సూపర్-8కు అర్హత సాధించింది.

## రాహుల్, పడిక్కల్ శతకాలు



లక్నో: రంజీ ట్రోఫీ సెమీస్ పోరును కర్ణాటక తొలిరోజు ఘనంగా ఆరంభించింది. లక్నోలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న తొలి సెమీస్‌లో స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (211 బంతుల్లో 141, 11 ఫోర్లు, 5 సిక్సలు), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (236 బంతుల్లో 148 నాటౌట్, 16 ఫోర్లు, 2 సిక్సలు) భారీ శతకాలతో రాణించారు. ఈ ఇద్దరి సెంచరీలతో మొదటిరోజు కర్ణాటక 90 ఓవర్లకు 355/2 పరుగుల భారీ స్కోరు సాధించింది. జమ్మూకాశ్మీర్‌తో జరుగుతున్న రెండో సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న బెంగాల్.. మొదటి రోజు 249/5 చేసింది. సుదీప్ కుమార్ (136 బ్యాటింగ్) సెంచరీ చేశాడు.

## రన్నరప్ హర్మీత్, యశస్విని




చెన్నై: భారత టేబుల్ టెన్నిస్ ద్వయం హర్మీత్ దేశాయ్, యశస్విని ఘోర్పడె డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ఇక్కడ జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో భారత జోడీ.. 0-3 (9-11, 2-11, 8-11)తో రొమానియా సెకండ్ సీడ్ ఎడ్వర్డ్, బెర్నాడెట్ చేతిలో ఓడింది.

# 'జన నాయగన్' విడుదలపై అనిశ్చితి ..

**కోర్టు, సెన్సార్ అడ్డంకులతో విజయ్ చివరి చిత్రం ఆలస్యం**

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ కెరీర్‌లో చివరి చిత్రంగా ప్రచారం పొందుతున్న పొలిటికల్ థ్రిల్లర్ జన నాయగన్ పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజకీయ నేపథ్యం, సామాజిక అంశాల మేళవింపుతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు హెచ్. వినోద్ రూపొందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఖఎచీ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడిగా నటిస్తుండగా, హీరోయిన్‌గా పూజా హెగ్డే, కీలక పాత్రలో మమితా బైజు కనిపించనున్నారు. సంగీతాన్ని యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సమకూర్చడం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణగా మారింది. మొదట ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ, సెన్సార్ ప్రక్రియలో తలెత్తిన సమస్యలతో రిలీజ్ వాయిదా పడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) కొన్ని సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా మత విభేదాలకు దారితీసే అంశాలు, భద్రతా దళాలు మరియు విదేశీ శక్తుల ప్రస్తావనపై స్పష్టత అవసరమని సూచించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది. దీంతో నిర్మాతలు మద్రాస్ హైకోర్టు ను ఆశ్రయించారు. తొలుత సింగిల్ బెంచ్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించినప్పటికీ, ఆ తీర్పును సవాల్ చేస్తూ జదీఖీజ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. అనంతరం డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఉత్తర్వులను రద్దు చేసి, పూర్తి వాదనలు వినాలంటూ కేసును మళ్లీ పునర్విచారణకు పంపింది. దీంతో సినిమా విడుదల పూర్తిగా సందిగ్ధంలో పడింది.

ఇలాంటి పరిస్థితుల్లో కెనడా డిస్ట్రిబ్యూషన్ సంస్థ యార్క్ సినిమాస్ విడుదల చేసిన ప్రకటన మరోసారి చర్చనీయాంశమైంది. తమ అధికారిక ప్రకటనలో "జన నాయగన్ చిత్రం ఏప్రిల్ 30కు ముందు విడుదల కానుందని ఆశించవద్దు. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారు రిఫండ్ కోసం థియేటర్లను సంప్రదించవచ్చు" అని పేర్కొనడం అభిమానుల్లో నిరాశను కలిగించింది. దీంతో ఫిబ్రవరి విడుదల ఆశలు పూర్తిగా సన్నగిల్లాయి. ప్రస్తుతం ఈ సినిమా వేసవి కానుకగా మే నెలలో విడుదలయ్యే అవకాశాలపై సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అదే సమయంలో తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విడుదల మరింత ఆలస్యం కావచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు, సెన్సార్ సూచనలకు అనుగుణంగా దాదాపు 15--20 నిమిషాల ఫుటేజ్ తొలగించడం, కొన్ని డైలాగ్‌లను సవరించడం వంటి మార్పులతో కొత్త వెర్షన్‌ను మళ్లీ సమర్పించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అభ్యంతరాలు లేకుండా క్లియరెన్స్ లభిస్తే, కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశముంది. మొత్తానికి 'జన నాయగన్' విడుదల ఎప్పుడు అన్నదానిపై స్పష్టత రాకపోయినా, కోర్టు తీర్పు మరియు సెన్సార్ క్లియరెన్స్ ఆధారంగానే తుది నిర్ణయం వెలువడనుంది. విజయ్‌ను వెండితెరపై చివరిసారిగా చూడాలనుకుంటున్న అభిమానులకు మాత్రం ఇంకొంతకాలం నిరీక్షణ తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609